ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 7 సెప్టెంబరు 2024





అనంతపురం సప్తగిరి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం, కొలువుదీరిన స్వామివారు విద్యుత్ దీపాల వెలుగులలో ఇలా.. మనోహరంగా..

పంచేద్దాం.. ఆనందాన్ని..!

నేడు వినాయకచవితి

వేడుకలకు సిద్ధమైన జనం

మార్కెట్లు, కూడళ్లలో రద్దీ

పండుగలు బంధుమిత్రులను ఒక చోట కలుపుతాయి. ఇంటిల్లిపాదికీ సంతోషాన్నిస్తాయి. కొత్త బట్టలు, పిండి వంటలు, పూజలు, సినిమాలు, ఆలయ సందర్శన.. ఇలా ఎన్నెన్నో ఆనందాలను మోసుకొస్తాయి. కానీ, కొందరి కష్టాలను, చిన్న చిన్న కోరికలను కూడా తీరుస్తాయి. పూజా సామగ్రి, వస్తు విక్రయాల ద్వారా కొంత సొమ్ము వారి చేతికి వస్తుంది. ఆ ఒక్క రోజు సంపాదనపై వారు ఎన్నెన్నో ఆశలు పెట్టుకుంటారు. మిగిలిన పండుగలతో పోలిస్తే.. వినాయచవితి ఆదాయం ఎక్కువ. గణపతి ప్రతిమలు, పూలు, పండ్లు, చెరుకులు, అరటి పిలకలు, గరిక.. ఇలా భిన్నమైన పూజా సామగ్రి ఈ వేడుకలలో వినియోగిస్తారు. ఒక్క రోజు వచ్చే ఆదాయం కోసం కొందరు పూజా సామగ్రిని సేకరించి.. రోడ్డు పక్కన, కూడళ్లలోనా అమ్ముతుంటారు. అలాంటి వారు అనంతపురం నగరంలో పదుల సంఖ్యలో కనిపిస్తారు. జిల్లాలోని ప్రధాన పట్టణాల్లోనూ ఇలాంటి 'ఒక్క రోజు' వ్యాపారులు చాలా మంది ఉంటారు. ఆటోవాలాలు, సంచార జాతులవారు, కూలీలు, భవన నిర్మాణ కార్మికులు.. వినాయకచవితి ఆదాయం ద్వారా ఊరట చెందుతారు. 'వీటిని అమ్మితే ఎంతొస్తుంది..? ఆ డబ్బు ఏం చేస్తారు..?' అని అడిగితే.. కొంతమంది తమ పిల్లలకు కొత్త బట్టలు కుట్టిస్తామని అన్నారు. మరికొందరు చదువులకు ఖర్చుపెడతామన్నారు. చిన్న చిన్న అవసరాలకు పనికొస్తాయని అన్నారు. బొజ్జ గణపతి తన భక్తుల ద్వారా ఇలా పేదలను ఆదుకుంటున్నారు చూశారా..?



పండుగ సామగ్రి కొనుగోలుదారులతో కిక్కిరిసిన పాతూరు

ఆ కిక్కే వేరు..!

వ్యాపారం అంటేనే బేరసారాలు ఉంటాయి. కానీ, రోడ్డు పక్కన చిరు వ్యాపారులతో బేరం ఆడకుండా కొని చూడండి..! వారి కళ్లలో మెరుపు కనిపిస్తుంది. పూజా సామగ్రిని సంచిలో సర్ది మరీ మిమ్మల్ని బైకు ఎక్కిస్తారు. 'ఇట్ల పట్టుకోండి సర్.. మీరు బండి ఎక్కండి మేడం.. నేను అందిస్తా..' అని సంతోషంగా సాగనంపుతారు. మాల్స్‌కు వెళితే మాట మాట్లాడకుండా బిల్లును చెల్లిస్తాం. క్రెడిట్ కార్డును దర్జాగా గోకిస్తాం. చిరు వ్యాపారుల వద్ద కూడా మనం ఇంతే దర్జాగా వందో రెండొందలో ఇస్తే.. వారి కష్టాలను కొంతైనా తీర్చినవారమౌతాం..! పండుగ అంటే.. మనం ఆనందంగా ఉండటమే కాదు.. మన చుట్టూ ఆనందాన్ని నింపడం..! నింపేద్దాం..! మహా అంటే.. పూజాపత్రాల వద్ద ఓ రెండొందలు ఖర్చవుతుంది. పూల వద్ద ఓ యాభై ఎక్కువ అవుతుంది. ఏమంటారు..? ఎదుటివారి కళ్లలో ఆనందానికి మనం కారణమైతే.. ఆ ఫీలింగే వేరు..! ట్రై చెయ్యండి..! చాలా బాగుంటుంది..!





నగరంలోని అరవిందనగర్‌లో 130 కేజీల కస్తూరి పసుపు కొమ్ములతో 12 అడుగుల వినాయక విగ్రహం



కొలువుకు తరలుతున్న గణనాథుడు



ఈ పూలు చూడు... భలేగున్నాయ్..



ద్విచక్ర వాహనంపై.. మూషిక వాహనుడు



అరటి పిలకల కొనుగోలు





చిన్నారులు.. యువతులు.. అంతా నీ చల్లని దీవెన కోసమే గణపయ్యా..



మట్టి గణపతి.. మా ఇంటికి..



కడుపు నిండా తిను కన్నా..!

అనంతపురం నగరంలోని క్లాక్ టవర్ సమీపంలో కన్న బిడ్డలకు గోరు ముద్దలు తినిపిస్తున్నది ఆటో డ్రైవర్ అరుణ్ కుమార్, ఆయన భార్య. రాజీవ్ కాలనీ పంచాయతీలోని ముత్యాలమ్మ కాలనీలో ఉంటారు వీరు. వినాయకచవితి పూజా సామగ్రిని నగర శివారు ప్రాంతాలలోని పొలాలు, తోటలలో సేకరించి, ఆటోలో తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. భార్య, పిల్లలు ఇలా రోడ్డు పక్కన ఒక్క రోజు వ్యాపారులుగా మారారు. వారం రోజులపాటు ఆటో తోలితే వచ్చే సంపాదన ఈ ఒక్కరోజే వస్తుందని అరుణ్ కుమార్ అన్నారు. పదిహేనేళ్లుగా పండుగకు ముందు రోజు తాము పూజా సామగ్రిని విక్రయిస్తామని, వచ్చిన ఆదాయాన్ని అప్పులు తీర్చేందుకు, ఇతర అవసరాలకు వాడుకుంటామని అన్నారు. అమ్మకాలు జోరుగా సాగే సమయంలోనూ తీరిక చేసుకుని మరీ బిడ్డల ఆకలి తీర్చడం కన్నవారి ప్రేమకు అద్దం పడుతోంది.

- అనంతపురం కల్చరల్

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



రైతు నాగార్జున మృతదేహం

గార్లదిన్నె, సెప్టెంబరు 6: విద్యుదాఘాతంతో యర్రగుంట్ల గ్రామ యువ రైతు నాగార్జున(34) శుక్రవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన నారాయణప్ప, తిరుపాలమ్మ రైతు దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు నాగార్జున శుక్రవారం ఉదయం తోటలో పంటకు నీరు పెట్టేందుకు మోటార్‌ను ఆన్ చేసేందుకు ప్రయత్నించాడు. స్టార్టర్ పెట్టెను ముట్టుకోగానే విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆటోలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాసరెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి నాగార్జున మృతదేహాన్ని సందర్శించారు. బాధిత కుటుంబానికి ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి రూ.10 వేలు అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతునికి భార్య ఆదిలక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్ బాషా తెలిపారు.

క్రస్ట్ గేట్లు భద్రమేనా..?

- పరిశీలనకు నిపుణుల కమిటీ • 9న తుంగభద్ర డ్యాం వద్దకు..



తారాపురం సుధాకర్

కర్నూలు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ప్రాజెక్టును ఈ నెల 9, 10 తేదీలలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన నిపుణుల కమిటీ సందర్శించనుంది. గత నెల 10న చైన్ లింగ్ తెగిపోయి వరద ఉధృతికి కొట్టుకుపోయిన 19వ నంబరు క్రస్ట్‌గేట్‌తో పాటుగా మిగిలిన 32 క్రస్ట్‌గేట్ల భద్రత, ఇతర అంశాల అధ్యయనం కోసం ఈ బృందం వస్తోంది. జాతీయ జలాశయాలు భద్రతా సంస్థ, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలో డిల్లీకి చెందిన రిటైర్డ్ మెకానికల్ ఇంజనీరింగ్ నిపుణుడు హర్కేశ్ కుమార్, జాతీయ, అంతర్జాతీయ సాగునీటి ప్రాజెక్టుల కోసం పని చేసిన కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మెకానికల్ ఇంజనీరింగ్ నిపుణుడు తారాపురం సుధాకర్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ఎంపిక చేసే ఇంజనీరింగ్ ప్రతినిధులు ఇందులో ఉన్నారు. ఏకే బజాజ్, హర్కేశ్‌కుమార్, తారాపురం సుధాకర్‌కు హైడ్రో-మెకానికల్, ఎలక్ట్రికల్ సిస్టమ్ సేఫ్టీ ఎక్స్‌పర్టులుగా వివిధ అధ్యయన కమిటీల్లో పని చేసిన అనుభవం ఉంది. తుంగభద్ర డ్యాంకు వరద దగ్గడంతో ఆగస్టు 10న రాత్రి ఎత్తిన క్రస్ట్‌గేట్లు దింపుతుండగా చైన్ లింక్ తెగిపోవడంతో 19వ గేటు కొట్టుకుపోయిందని టీబీపీ బోర్డు అధికారులు అంటున్నారు. చైన్‌లింక్ తెగిపోయినా క్రస్ట్ గేట్ గ్రూవ్ (గాడి) నుంచి విడిపోయి వరద ఉధృతికి కొట్టుకుపోవడం అనుమానాలకు తావిస్తుంది. కన్నయ్యనాయుడు నేతృత్వంలో క్రస్ట్‌గేట్ స్థానంలో స్టాప్‌లాగ్‌ను అమర్చారు. అయితే.. గేటు ఎలా కొట్టుకుపోయింది..? మిగిలిన గేట్లు ఎంతవరకు భద్రం..? అన్న ప్రశ్నలు తలెత్తున్నాయి. ఈ సందేహాల నివృత్తి కోసం నిపుణుల కమిటీ వస్తోంది. వర్షాకాలం ప్రారంభానికి ముందు, తరువాత క్రస్ట్‌గేట్ల తనిఖీ, మరమ్మతుల వివరాలు, డ్యాం డిజైన్, హైడ్రో మెకానికల్, ఎలక్ట్రికల్ వివరాలు కావాలని బోర్డు అధికారులను నిపుణుల కమిటీ కోరినట్లు సమాచారం. ఈ మేరకు టీబీపీ బోర్డు అధికారులు నివేదికలు తయారు చేస్తున్నారని తెలిసింది.

టీబీడ్యాంలో 101.7 టీఎంసీల నీటి నిల్వ

తుంగభద్ర డ్యాంలో శుక్రవారం 101.773 టీఎంసీల నీటి నిల్వలు నమోదయ్యాయి. డ్యాంలోకి 32347 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 33439 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉన్నట్లు జలాశయం అధికారులు వెల్లడించారు.

చాగల్లు రిజర్వాయర్‌ను నింపండి: కలెక్టర్



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

తాడిపత్రి, సెప్టెంబరు 6: చాగల్లు రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులకు సూచించారు. పెద్దపప్పూరు మండలంలోని చాగల్లు రిజర్వాయర్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. రిజర్వాయర్ సామర్థ్యం 1.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.90 టీఎంసీల నిల్వ ఉందని, మిగిలిన నీటిని నిల్వ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మరమ్మతులు అవసరమైతే వెంటనే చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్, ఇరిగేషన్ ఈఈ రమణారెడ్డి, తహసీల్దార్ బాలాజీ, ఎంపీడీఓ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

సెంట్రల్ వర్సిటీకి సర్వే బాధ్యత

కేంద్ర పథకాల అమలుపై సమగ్ర సర్వే



డాక్టర్ కేశవరెడ్డి, డాక్టర్ బ్రబరాజ మిశ్రా

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 6: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు సెంట్రల్ యూనివర్సిటీ అధికారులు వెల్లడించారు. నీతి అయోగ్, ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) జాతీయ సంస్థలు సంయుక్తంగా చేపట్టిన ఈ ప్రాజెక్టును సెంట్రల్ యూనివర్సిటీకి అప్పజెప్పాయి. వర్సిటీ ఆర్థికశాఖ అసోసియేట్ ప్రొఫెసర్లు కేశవరెడ్డి, బ్రబరాజ మిశ్రా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేయనున్నారు. ఇందుకు రూ.25లక్షలు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. 18నెలలు, 24 నెలల కాల పరిధిలో సర్వేను పూర్తి చేయాలని కేంద్రం షరతు విధించిందన్నారు. విశాఖపట్నం, గుంటూరు, చిత్తూరు, అనంతపురం ఉమ్మడి జిల్లాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు, మహిళాసాధికారత ప్రగతిపై ఆయా జిల్లాల్లో క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తారు. ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా కేశవరెడ్డి, ఇన్వెస్టిగేటర్స్‌గా బ్రబరాజమిశ్రాతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన సెంట్రల్ యూనివర్సిటీల అధికారులు ఇద్దరు ఉంటారు. వీరికి అదనంగా ఫీల్డ్ ఆఫీసర్లు, డేటా అనలిస్టులు పనిచేయనున్నారు. కాగా, ప్రాజెక్ట్ దక్కడంపై వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కోరీ మాట్లాడుతూ తమకు వచ్చిన మొదటి ఈ ప్రాజెక్టు ఇదని, భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులు వస్తాయని పేర్కొన్నారు.

నిరీక్షణకు తెర..!

జేఎన్‌టీయూ బోధనేతర సిబ్బందికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేత



జేఎన్‌టీయూ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఉద్యోగులు

అనంతపురం సెంట్రల్, సెప్టంబరు 6: విశ్రాంత ఉద్యోగుల నిరీక్షణ ఫలించింది. రెండేళ్లుగా అందని రిటైర్మెంట్ బెనిఫిట్స్ వారికి అందాయి. రిటైర్ అయినా పెన్షన్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కముటేషన్ డబ్బులు చెల్లించ కుండా గత వైసీపీ ప్రభుత్వం రెండేళ్లుగా జేఎన్‌టీయూ బోధనేతర ఉద్యోగులను వేధించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్‌డీ టూ వీసీ దేవన్న రిటైర్ అయిన ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక ప్రయోజనాలపై ప్రత్యేక చొరవచూపారు. దీంతో 12మంది ఉద్యోగులకు రూ.4.13కోట్లు రాష్ట్ర ప్రభుత్వ విడుదల చేసింది. ఈ మొత్తాన్ని సంబంధిత రిటైర్ ఉద్యోగులకు అందజేశారు. వారు శుక్రవారం జేఎన్‌టీయూ యాజమాన్యాన్ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ సుదర్శనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బోధనేతర సిబ్బందికి ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచారన్నారు. అయితే జీఓ అమలు చేయకపోవడంతో రిటైర్ అయి రెండేళ్లయినా సర్వీస్‌లేక, పెన్షన్ అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ ఆఫీసర్ సిరాజుద్దీన్, ఏఆర్ నాగభూషణం పాల్గొన్నారు.

ఇక.. అంతేనా..!

ప్రశ్నార్థకంగా నాడు- నేడు పనులు

నిధులు విడుదల చేయని గత ప్రభుత్వం
నిలిచిపోయిన స్కూళ్లు, ఆస్పత్రుల అభివృద్ధి
పాడైపోయిన నిర్మాణ సామగ్రి
చేసిన పనులన్నీ నాసిరకమే..!
కూటమి ప్రభుత్వంలో మోక్షం కలిగేనా?

లేబొరేటరీ గది ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి



యాడికి, సెప్టెంబరు 6: నాడు-నేడు కార్యక్రమంతో ఆస్పత్రులను అభివృద్ధి చేసి మెరుగైన వైద్యసేవలు అందిస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వం చెప్పిన మాటలు నీటిమీద రాతలయ్యాయి. మండలకేంద్రంలో రూ.1.94కోట్లు, రాయలచెరువులో రూ.1.86కోట్లు వ్యయంతో



నాడు-నేడు కింద ఆస్పత్రుల నిర్మాణం కోసం 2022లో శంకుస్థాపన చేశారు. 'మెరుగైన వైద్యసేవలు అందిస్తాం. రోగులు ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు' అంటూ శంకుస్థాపన రోజు ప్రజాప్రతినిధులు హామీలు గుప్పించారు. తర్వాత కొద్దిమేరకు నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆస్పత్రుల నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో యాడికిలో శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లోనే రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి పైకప్పు పెచ్చులు ఊడి పడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని రోగులు, వైద్యులు ఆందోళన చెందుతున్నారు. రాయలచెరువులో చెట్ల కింద రోగులకు వైద్యం చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

భయంగా ఉంది



యాడికిలో ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. గోడలు అన్ని నెర్రెలు చీలాయి. చికిత్స కోసం హాస్పిటల్‌కు వెళ్లాలంటే భయంగా ఉంది. నాడు-నేడు కింద చేపట్టిన నిర్మాణ పనులు పూర్తయ్యేటట్లు చర్యలు తీసుకొని రోగులకు మెరుగైన సేవలు అందించాలి.

-నరసింహులు, పిన్నేపల్లి

ప్రజాధనం వృథా



వైసీపీ పాలనలో నాడు-నేడు కింద చేపట్టిన ఆస్పత్రి నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. రోగులకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తామని నాయకులు ఇచ్చిన హామీ ఒట్టిమాటే. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతోనే పనులు ఆగిపోయినట్లు చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలో భవన నిర్మాణాలు పూర్తి చేయాలి. లేకుంటే ప్రజాధనం వృథా అవుతుంది.

-రామకృష్ణ, కోనుప్పలపాడు



ప్రమాదకరంగా మారిన పైకప్పు

పూర్తికాని రెండో విడత పనులు



సీకేపల్లి ఉన్నత పాఠశాలలో పాత ట్యాంకు నీటిని తాగుతున్న విద్యార్థులు (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: మండలంలో రెండో విడత నాడు-నేడు పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. 40 పాఠశాలల అభివృద్ధికి రూ.9.61 కోట్లు కేటాయించగా పనులు చేపట్టారు. అదనపు తరగతి గదులు, వంట గదులు, మరుగుదొడ్లు, మేజర్, మైనర్ రిపేరీలు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటివరకు ఏవీ సక్రమంగా పూర్తికాలేదు. నాడు-నేడు పనులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అయితే అప్పట్లో కొందరు వైసీపీ నాయకులు కొందరు కమిటీలను పక్కనపెట్టి పాఠశాలలో పనులు చేపట్టారు. అప్పట్లో పనులు ఇష్టానుసారంగా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. నిధుల కొరతతో కొన్ని పాఠశాలలో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. వంట గదుల నిర్మాణం కూడా పూర్తి కాకపోవడంతో ఆరుబయటే వంటను తయారుచేస్తున్న పరిస్థితి ఉంది. పలు పాఠశాలల్లో ప్రహరీలు లేని పరిస్థితి ఉంది. పాఠశాలలో విద్యార్థులకు రక్షితమైన తాగునీటిని అందించడానికి నాడు-నేడు కింద ప్రభుత్వం సరఫరా చేసిన వాటర్‌ఫిల్టర్లు మూలనపడ్డాయి. మండలానికి 17 యూనిట్లు రాగా ఏడు ఫిల్టర్లు మాత్రమే పని చేస్తున్నట్లు తెలిసింది. మిగిలినవి ఆయా పాఠశాలలో నిరుపయోగంగా ఉన్నాయి. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను కూటమిప్రభుత్వంలోనైనా త్వరగా పూర్తి చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆదేశాలు రాగానే పనులు చేపడతాం



నాడు-నేడు ఫేజ్-2 కింద పనులు నిలిచిపోయింది వాస్తవమే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పనులు ఆపేశాం. డీఈఓ నుంచి తదుపరి ఆదేశాలు రాగానే పనులు మొదలు పెట్టి, పూర్తి చేస్తాం.

-ప్రసూన్‌కుమార్‌నాయుడు, ఎంఈఓ-2, సీకేపల్లి



కేజీబీవీలో అర్ధంతరంగా నిలిచిపోయిన అదనపు గదుల నిర్మాణం






న్యామద్దల ఉన్నత పాఠశాలలో ఆరుబయటే మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న దృశ్యం, సీకేపల్లి ఉన్నత పాఠశాలలో వృథాగా ఉన్న వాటర్‌ఫిల్టర్

---

58 పాఠశాలల్లో ఆగిన పనులు



శింగనమల జిల్లా పరిషత్ పాఠశాలలో పెచ్చులూడిన కప్పు..



శింగనమల పాఠశాలలో వర్షానికి చేరిన నీరు

శింగనమల, సెప్టెంబరు 6: గత వైసీపీ పాలనలో మూడేళ్ల కిందట మండలంలోని 58 పాఠశాలల్లో నాడు నేడు పనులకు శ్రీకారం చుట్టారు. అధిక నిధులు తీసుకొచ్చి పాఠశాలను బాగు చేస్తామని నాటి ఎమ్మెల్యే జొన్నగడ్డల పద్మావతి భర్త, అప్పటి ప్రభుత్వ సలహాదారుడు ఆలూరు సాంబ శివారెడ్డి గొప్పలు చెప్పాడు. మూడేళ్లు గడిచినా మండలంలోని ఏ ఒక్క పాఠశాలలో ఈ పనులను పూర్తి చేయలేదు. శింగనమల జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ పనులనూ ఆలూరు సాంబశివారెడ్డి తన బంధువైన కాంట్రాక్టర్‌కు ఇచ్చి.. అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. కాంట్రాక్టర్ పనులను నాసిరకంగా చేయడంతో పైకప్పు పెచ్చులూడుతున్నాయి.

అన్నీ పెండింగ్...

శింగనమల సాంబశివారెడ్డి సొంత మండలంలో కావడంతో రెండు విడతల్లో 58 పాఠశాలల్లో నాడు నేడు కింద పనులకు రూ.కోట్లను మంజూరు చేయించుకున్నారు. కాంట్రాక్టర్లుగా ఉన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలకే ఆ పనులు అప్పగించారు. మొదటిగా పాఠశాలలో పైకప్పు, ఫ్లోరింగ్, బోర్డుల నిర్మాణాల పనులు చేపట్టారు. అయితే వాటికి బిల్లులు రాకపోవడంతో ఆ పనులను కాంట్రాక్టర్లు నిలిపేశారు. చేసిన పనుల్లోనూ నాణ్యత లేకపోవడంతో ఏడాది నుంచే పై కప్పులు పెచ్చులూడుతున్నాయి. వర్షం పడినప్పుడు ఎక్కడ పెచ్చులూడి పడతాయోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. చాలా పాఠశాలలో ఆ పనులను మధ్యలోనే ఆపేశారు. దాంతో కొన్ని పాఠశాలల్లో ఇరుకు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు.

నిరుపయోగంగా సిమెంట్ బస్తాలు, సామగ్రి

మండలంలో 58 పాఠశాలలో పనులు ప్రారంభంకాగానే వాటికి సంబంధిత సిమెంట్, సామగ్రి, గ్రానైట్, ఉడ్ వర్క్ పనుల సామగ్రిని అధికారులు సరఫరా చేశారు. అయితే అలా సరాఫరా చేసిన సుమారు 5000 సిమెంట్ బస్తాలను ఇప్పటికి వాడకపోవడంతో అవి గడ్డ కట్టి వృథాగా మారినట్లు సమాచారం. గ్రానైట్ బండలు పగలిపోగా.. ఉడ్‌కు చెదలు పడుతున్నట్లు తెలుస్తోంది.

పనులు పూర్తి చేయాలి..




నాడు-నేడు కింద పాఠశాలల్లో పనులు మధ్యలోనే నిధులు లేవని ఆపేశారు. దాంతో విద్యార్థులకు గదులు కొరత ఏర్పడింది. నాశిరకం పనులు చేయడంతో శింగనమలలో చాలా గదులల్లో పై పెచ్చులు ఊడి పడుతున్నాయి. నాశిరకం పనులు చేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి.

-సురేష్ కుమార్, శింగనమల విద్యాకమిటీ చెర్మన్

పై.. పై.. మెరుగులే...

శింగనమల జిల్లా పరిషత్ పాఠశాల ఆలూరు సాంబశివారెడ్డి చదువుకొన్న పాఠశాల కావడంతో ప్రత్యేకంగా నాబార్డు నిధులు రూ.1.8 కోట్లను మంజూరు చేయించుకున్నారు. పాఠశాలలో గదుల పైకప్పులన్నింటికి మర్మమతులు చేయించారు. గోడలకు రంగులేశారు. పాఠశాల గేటును అందంగా అలంకరించారు. ప్రహరీ పక్కన ఉన్న చిరు వ్యాపారులను బలవంతంగా ఖాళీ చేయించి.. అక్కడ మొక్కలు నాటించారు. ఇలా పై.. పై.. మెరుగులే తప్ప.. పనుల్లో నాణ్యత పూర్తిగా లోపించింది. ఇటీవలి వర్షాలకు గదులన్నీ కారుతున్నాయి. కప్పులు పెచ్చులూడుతున్నాయి. పాఠశాలలో మురుగుదొడ్లకు నీటి సౌకర్యం కల్పించక పోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. పాఠశాలకు కనీసం తాగు, విద్యుత్తు సౌకర్యమూ కల్పించలేదు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే మండలంలో నిలిచిపోయిన పనులన్నింటిని పూర్తి చేయిస్తామని ఎంఈఓ నరసింహ రాజు తెలిపారు.

వరద బాధితులకు 'అమిలినేని' రూ.50 లక్షల విరాళం



ముఖ్యమంత్రికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 6: వరద బాధితుల కోసం రూ. 50 లక్షలను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అందజేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన టీడీపీ నాయకులు రాజగోపాల్, వెంకటేశులు కలిసి విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం పిలుపుమేరకు వరద బాధితులను ఆదుకునేందుకు మరింతగా సాయం చేస్తానని తెలిపారు. బాధితుల కోసం సీఎం రాత్రింబవళ్లు కష్ట పడుతున్నట్లు తెలిపారు. సీఎం పిలుపుతో వరద బాధితులను ఆదుకునేందుకు ఎంతోమంది మానవత్వంతో ముందుకు వస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం వారు మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

వైద్య కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ఏర్పాటు



రిజిస్ట్రేషన్ పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 6: అనంత వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు తెలిపారు. సంఘం ఏర్పాటుకు కళాశాలలో పూర్వవిద్యార్థులు, ప్రస్తుత డాక్టర్లు సమావేశమై శుక్రవారం చర్చించినట్లు వివరించారు. పూర్వవిద్యార్థుల సంఘం నూతన కమిటీకి ఆమోదం లభించింది. అధ్యక్షుడిగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ప్రధానకార్యదర్శిగా డాక్టర్ రామస్వామినాయక్, కోశాధికారిగా మేడా ఆత్మారామ్, కో-ట్రెజరర్‌గా డాక్టర్ మధుసూదన్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ నవీన్‌కుమార్, జాయింట్ సెక్రెటరీగా డాక్టర్ హరికృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ పద్మశ్రావణి, డాక్టర్ హేమలత, డాక్టర్ పూర్ణచంద్రరావు, డాక్టర్ విజయకుమారి, డాక్టర్ వెంకట రమాబాయి తదితరులు నియమితులయ్యారని ప్రిన్సిపాల్ వెల్లడించారు. దశాబ్దాల కాలంగా వైద్యకళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నా నెరవేరలేదని, ఇపుడు అది నెరవేరడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. తాను సంఘానికి గౌరవాధ్యక్షుడిగా ఉంటున్నానని కళాశాల అభివృద్ధికి ఈసంఘం ద్వారా కృషి చేస్తానన్నారు. ఇందుకోసం ప్రత్యేక ఆఫీస్‌ను ఏర్పాటు చేసి, ప్రతిమూడు నెలలకోసారి సమావేశమయ్యేలా చూస్తానన్నారు.

ఫలితం దిశగా...

- ★ ఆసక్తికరంగా దులీప్‌ట్రోఫీ తొలి మ్యాచ్
- ★ 168 పరుగులకు కుప్పకూలిన ఇండియా-సి
- ★ రెండో ఇన్నింగ్స్‌లో ఇండియా-డి 206/8
- ★ అర్ధసెంచరీలతో రాణించిన శ్రేయస్, పడిక్కల్



రెండోరోజు ఆటలో దృశ్యం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6: దులీప్‌ట్రోఫీలో తొలి మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతోంది. ఫలితం దిశగా ఆట సాగుతోంది. స్థానిక అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో శుక్రవారం రెండోరోజు పోటీలు కొనసాగాయి. ఓవర్‌నైట్ స్కోర్ 4వికెట్లకు 91పరుగులతో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా-సి జట్టు 48.3ఓవర్లలో 168పరుగులకు ఆలౌట్ అయ్యింది. రెండోరోజు 77పరుగులు మాత్రమే చేసి మిగతా ఆరు వికెట్లను కోల్పోయింది. జట్టులో బాబా ఇంద్రజిత్ 149బంతుల్లో 9ఫోర్ల సాయంతో 72 పరుగులు చేశాడు. వికెట్‌కీపర్ అభిషేక్ పోరెల్ 34పరుగులు చేశాడు. ఎక్స్‌ట్రాలతో కలిసి ఇండియా-సి 168పరుగులు చేసి 4 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఇండియా-డి బౌలర్లు పేసర్ హర్షిత్ రాణా 4వికెట్లు, అక్షర్ పటేల్, శరాన్షజైన్ చెరో రెండు వికెట్లు, ఆదిత్యథాక్రే, అర్ష్‌దీప్‌సింగ్ చెరో వికెట్ పడగొట్టారు.

రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే తడబ్యాటు

ఇండియా-డి జట్టు మొదటి ఇన్నింగ్స్ తరహాలోనే రెండో ఇన్నింగ్స్‌లోను తడబడింది. ఇండియా-సి లెఫ్టార్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ 5 వికెట్లు పడగొట్టి ఇండియా-డి బ్యాటర్లను కట్టడి చేశాడు. 15 ఓవర్లలో 30పరుగులు ఇచ్చి 5 కీలక వికెట్లు పడగొట్టాడు. మరో పేసర్ వైశాక్ 2, అన్షుల్ కాంబోజ్ వికెట్ పడగొట్టారు. దీంతో రెండో రోజు ఆటముగిసే సమయానికి ఇండియా-డి జట్టు 8 వికెట్ల నష్టానికి 206పరుగులు చేసింది. క్రీజులో అక్షర్‌పటేల్ 11పరుగులు, హర్షిత్‌రాణా పరుగులేమీ చేయకుండా ఉన్నారు. జట్టులో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కేవలం 44బంతుల్లో 9ఫోర్లు, సిక్సర్ సాయంతో 54పరుగులు, పడిక్కిల్ 70బంతుల్లో 8బౌండరీల సాయంతో 56పరుగులు చేశారు. మరో బ్యాటర్ రిక్కీభూయ్ 44 పరుగులు చేశాడు. ప్రస్తుతం ఇండియా డి జట్టు 202 పరుగుల ఆధిక్యంలో ఉంది.

అధికారుల మధ్య సమన్వయలోపం

నిర్వాహక అధికారులు, సభ్యుల మధ్య సమన్వయలోపంతో దులీప్‌ట్రోఫీలో పాసుల జారీలో గందరగోళం నెలకొంది. బీసీసీఐ సూచనల ప్రకారం ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ, ఆర్గనైజింగ్ కమిటీలు సమన్వయం చేసుకుని దులీప్‌ట్రోఫీ విజయవంతం చేయాలని భావించారు. అయితే గత రెండు రోజులుగా కొందరు పాసులు లేకుండానే లోపలికి రావడం, ఒక రకమైన పాసు పొంది మరో గ్యాలరీలోకి రావడం పట్ల కొంత గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మీడియా గ్యాలరీలోకి ఇతరులు రావడంతో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మీడియా మేనేజర్ రాజగోపాల్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ మధ్య మనస్పర్థలకు దారితీసింది. నాసిరకంగా ఆహార పొట్లాలను ఇవ్వడం పట్ల మీడియా ప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని మీడియా ప్రతినిధులు మీడియా కోఆర్డినేటర్ తిమ్మప్ప, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యులు మాంచో ఫెర్రర్ దృష్టికి తీసుకెళ్లారు. పాసుల జారీలో పలువురు మధ్య తీవ్ర మనస్పర్థలకు దారితీస్తున్నాయి. ఈ విషయాన్ని బీసీసీఐ ప్రతినిధులు, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని క్రికెట్ అభిమానులు కోరుతున్నారు.

తైక్వాండో రాష్ట్ర జట్టు కోచ్‌గా సాయిబాబా

తాడిపత్రి, సెప్టెంబరు 6: తైక్వాండో రాష్ట్ర జట్టుకు కోచ్‌గా తాడిపత్రికి చెందిన జిల్లా స్పోర్ట్స్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సాయిబాబా ఎంపికయ్యారని రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్‌రావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8, 9, 10వ తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో జాతీయ స్థాయి తైక్వాండో పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సబ్, జూనియర్ కేటగిరిల్లో సుమారు 86మంది క్రీడాకారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

జీడిపల్లికి 1026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 6: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1026 క్యూసెక్యులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే హెచ్ఎన్ఎస్ఎస్ ఫేస్-2 కు అవుట్ ఫ్లో 932 క్యూసెక్కులు, పీఏబీఆర్‌కు మరువ నుంచి 54 క్యూసెక్కులు ఉన్నట్లు వారు వెల్లడించారు.

నవ యువకుడిలా పనిచేస్తున్న చంద్రబాబు

- బురద రాజకీయాలు చేస్తున్న ప్రతిపక్షం
- ఎమ్మెల్యే పరిటాల సునీత మండిపాటు



విజయవాడకు వెళ్తున్న టమోటా వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురంరూరల్, సెప్టెంబరు 6: వరద బాధితులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు 74ఏళ్ల వయసులో కూడా నవ యువకుడిలా పని చేస్తున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కక్కలపల్లి టమోటా మండీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 40టన్నుల టమోటాను విజయవాడ వరద బాధితులకు ప్రత్యేక వాహనాల్లో పంపే ఏర్పాట్లు చేశారు. వీటిని ఎలాంటి బాడుగ లేకుండా తీసుకెళ్లేందుకు ది అనంతపురం హెవీ గూడ్స్ లారీ ఓనర్స్ ముందుకొచ్చారు. వాహనాలను ఎమ్మెల్యే పరిటాల సునీత శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడ వరద బాధితుల్ని ఆదుకునేందుకు టమోటా మండీ ఓనర్స్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. రవాణా సౌకర్యం కల్పించిన లారీ ఓనర్స్‌ను అభినందించారు. వరద బాధితులను ఆదుకునేందుకు చంద్రబాబు గత ఐదు రోజులుగా అక్కడే ఉండి రాత్రింబవళ్లు కష్టపడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇంత సాయం చేస్తుంటే ప్రతిపక్షాలు బురద రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. వైసీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలన్నారు. గతంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మీ ముఖ్యమంత్రి క్షేత్ర స్థాయికి వెళ్లకుండా విమానాల్లో పర్యటించిన విషయం మరువరాదన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి, రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ మండీ అసోయేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్, లారీ అసోయేషన్ అధ్యక్షుడు నీలకంఠ నాయుడు, మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సర్దానప్ప, మణికంఠబాబు, సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిఖరమంత అభిమానం

ఒంటినిండా క్రికెటర్ శిఖర్‌ధావన్ టాటూలు



టాటూలతో శంకర్ గీతా ధావన్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6: క్రికెట్‌ను ఓ మతంగా భావించే మనదేశంలో క్రికెటర్లను వేల్పులుగా చాలా మంది ఆరాధిస్తారు. అనతి కాలంలోనే క్రికెట్ అభిమానుల మనసు చూరగొన్న బ్యాటర్లలో శిఖర్‌ధావన్ ఒకడు. స్ట్రోక్‌ప్లేతో ఎన్నో మ్యాచ్‌లలో ఆయన అద్భుతంగా రాణించాడు. ఆ ఆటకు ముగ్ధుడైన బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరుకు చెందిన శంకర్ గీతా ధావన్ వీరాభిమానిగా మారాడు. గత 13ఏళ్లుగా శిఖర్‌ధావన్ ఎక్కడా మ్యాచ్ ఆడితే అక్కడికి వెళ్లేవాడు. ఇలా శిఖర్ ధావన్ కళ్లలో పడిన శంకర్ గీతాధావన్‌ను ఇప్పటి వరకు సుమారు 13దేశాలకు తన వెంట సొంత ఖర్చులతో తీసుకెళ్లాడు. అభిమానం ఆరాధనగా మారడంతో శంకర్ గీతా ధావన్ తన ఒంటిపైన రూ.13లక్షలు ఖర్చు పెట్టి శిఖర్‌ధావన్ జీవిత చరిత్ర మొత్తం తన ఒంటిపై టాటూ(పచ్చబొట్టు) వేసుకున్నాడు. ఈక్రమంలో అనంతపురం జరిగే దులీప్‌ట్రోఫీ మ్యాచ్ చూడటానికి వచ్చిన ఆయన క్రికెట్ అభిమానులకు తన ఒంటిపై ఉండే టాటూలను చూపుతూ ఆకట్టుకుంటు న్నాడు. శిఖర్‌ధావన్‌లా శంకర్ గీతాధావన్ కూడా పిలక పెంచాడు.

ఆట చూస్తూ.. ఆనందిస్తూ..













దులీప్‌ట్రోఫీ క్రికెట్ పోటీలను తిలకించేందుకు ఆర్డీటీ స్టేడియానికి క్రీడాభిమానులు తరలివచ్చారు. ఆటను ఆస్వాదిస్తూ సందడి చేశారు. ఈల వేసి గోల చేశారు. చిన్నారులు చిందులు తొక్కారు.

ఏజెన్సీ నిర్వాహకులపై ఎంపీ, ఎమ్మెల్యే ఆగ్రహం

● ప్రభుత్వ పాఠశాల తనిఖీ



విద్యార్థులకు వడ్డించే అన్నాన్ని పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అనంతపురంరూరల్, సెప్టెంబరు 6: పాఠశాల వంట ఏజెన్సీ నిర్వాహకులపై ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు నగర్‌లో ప్రభుత్వ పాఠశాలను ఎంపీ, ఎమ్మెల్యేలు గురువారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. తరువాత విద్యార్థుల హాజరు ఎంతుందని చూశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అన్నం ముద్దగా ఉండటాన్ని గమనించి ఏజెన్సీ నిర్వహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి భోజనాన్ని విద్యార్థులు ఎలా తింటారని ప్రశ్నించారు. వెంటనే ఏజెన్సీ వారితో మాట్లాడి పాఠశాలకు నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని ఆదేశించారు. టీడీపీ రాష్ట్ర నాయకులు గంగారామ్, బీజేపీ లలిత్‌కుమార్, నాయకులు శ్రీనివాసులురెడ్డి, భక్తవత్సల నాయుడు, బాషా, ఖాసీం, బాలప్ప, నాగభూషణం పాల్గొన్నారు.

ప్రజలకు సక్రమంగా రేషన్ అందించాలి: ప్రజలకు క్రమం తప్పకుండా రేషన్ అందించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. మండలంలోని రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు నగర్, అజయ్‌ఘోష్‌కాలనీలో ఏర్పాటు చేసిన నూతన రేషన్ షాపులను వారు ప్రారంభించారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోండి

అనంతపురం అర్బన్: నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ తరుణ్‌కుమార్, మేనేజర్ మురళీకృష్ణ, నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ హరిప్రసాద్, ట్రాఫిక్ సీఐ రఘుప్రసాద్, ఇతర అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ట్రాఫిక్ సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, డ్రంక్ అండ్ డ్రైవ్, ఇతర అంశాలపై చర్చించారు.

వరద బాధితులకు అండగా స్వయం సహాయక మహిళలు: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు అనంతపురం అర్బన్ పరిధిలోని మెప్మా స్వయం సహాయ సంఘాల సభ్యులు ముందుకొచ్చారు. మాజీ మేయర్ స్వరూప ఆధ్వర్యంలో సభ్యులు వరద బాధితులకు సేకరించిన రూ.3.5 లక్షల చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌కు అందజేశారు. సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.

మట్టి విగ్రహాల పంపిణీ



మట్టి గణపతి, పూజా సామగ్రిని అందజేస్తున్న న్యాయాధికారి

అనంతపురం క్రైం: వినాయక చవితిని పురస్కరించుకుని అనంతపురం అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మట్టి వినాయక విగ్రహాలను, పూజా సామగ్రిని అందజేశారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం: కలెక్టర్



ఎన్‌వైకే కార్యాలయ ఆవరణలో మొక్క నాటి నీరుపోస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6: దేశం, సమాజాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక బుడ్డప్పనగర్‌లో ఉన్న నెహ్రూ యువకేంద్రం కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. కేంద్రప్రభుత్వం నెహ్రూయువకేంద్రం ద్వారా నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఎన్‌వైకే ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయంలో కలెక్టర్ మొక్కలు నాటారు. జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు జీవన్‌కుమార్, జయమారుతి, సాయిట్రస్టు వ్యవస్థాపకుడు విజయసాయి, సామాజిక సేవాకార్యకర్తలు రామకృష్ణారెడ్డి, మహేష్‌బాబు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహానికి ఆర్థిక సాయం




రూ.6 లక్షల చెక్కును అందజేస్తున్న సీవీ కొండయ్య

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 6: కమ్మ సంఘం ఆధ్వర్యంలో తెలుగు యువత మాజీ అధ్యక్షుడు సీవీ కొండయ్య బాలికల వసతి గృహానికి రూ.6 లక్షల ఆర్థికసాయం అందజేశారు. శుక్రవారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని బాలికల వసతి గృహంలో నిర్వాహకులకు ఒక గది నిర్మాణానికి ఆయన ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు బాంబే డయింగ్ నాగన్న, రామకృష్ణ, సరిపూటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు...

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 6: తల్లి మరణంతో అనాథలుగా మారిన ఇద్దరు నిరుపేద విద్యార్థుల చదువులకోసం ఆర్థిక సాయం అందించి అమ్మ సంస్థ అండగా నిలిచింది. అనంతపురం రూరల్ కేకే కాలనీ పంచాయతీ సీఎస్ పురానికి చెందిన నాగజ్యోతికి 9వ తరగతి, 6వ తరగతి చదువుతున్న ఇద్దరు కుమారులున్నారు. నాగజ్యోతి ఇటీవల మృతి చెందింది. తండ్రి కుమారులను వదిలేసి వెళ్లిపోయాడు. చిన్నారులిద్దరూ తమ సమీప బంధువుల వద్ద ఉంటూ చదువుకుంటున్నారు. పాఠశాలకు ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతుండడంతో అమ్మ సంస్థను ఆశ్రయించారు. శుక్రవారం సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి విద్యార్థులను కలిసి రూ.20వేలు ఆర్థిక సాయం అందించడంతోపాటు రూ.10వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను అందజేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం విద్య, సెప్టెంబరు 6: క్రీడలతో విద్యార్థుల్లో మానసికోల్లాసం వెల్లివిరుస్తుందని శ్రీ చైతన్య స్కూల్ ఏజీఎం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రుద్రంపేటలోని శ్రీచైతన్య స్కూల్ టెన్త్ బ్రాంచ్‌లో టీఎస్ రావు మెమోరియల్ లెవెల్ వన్ స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడా పతాకాన్ని ఎగరవేసి వేడుకను ప్రారంభించారు. క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రథమ విద్యార్థికి గోల్డ్ మెడల్, రెండవ విద్యార్థికి సిల్వర్ మెడల్, మూడవ విద్యార్థికి బ్రాంజ్ మెడల్‌ను ఆయన అందించారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి, జోనల్ పీఈటీలు విజయ్ కృష్ణ, శివప్రసాద్, ప్రైమరీ ఇన్‌చార్జిలు సరిత, స్వాతి, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి అమరావతి, డ్రాయింగ్ మాస్టర్ మధుకర్, డ్యాన్స్ మాస్టర్ విష్ణు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు పరిశీలన

నార్పల, సెప్టెంబరు 6: మండలంలోని కేసేపల్లి, నడిమిదొడ్డి గ్రామాలలో ఈ-పంట నమోదు ప్రక్రియను శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్-2024 సంబంధించి వ్యవసాయ, ఉద్యాన పంటలు వేసిన ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ-క్రాప్ చేయించుకున్న ప్రతి రైతు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో 12వేల ఎకరాలలో ఈ-క్రాప్ బుకింగ్ చేశారన్నారు. 15వ తేదీలోపు రైతు సేవా కేంద్రాలలో ఈ-పంట బుకింగ్‌ను చేసుకోవాలని ఆమె సూచించారు. వ్యవసాయ అధికారి చన్నవీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

నార్పల, సెప్టెంబరు 6: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బీ పప్పూరు పరిధిలో ఉన్న గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు కే హాజీరా, మహేంద్రనాథ్ 150 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టిలోపం ఉన్న వారికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్ శ్రీరాములు పాల్గొన్నారు.

వరద సహాయ నిధికి విరాళం

శింగనమల, సెప్టెంబరు 6: వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తండ్రి బండారు రవికుమార్ ఒకనెల పెన్షన్‌ను విరాళం అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన తన ఒకనెల పెన్షన్ రూ.66వేలు టీడీపీ కార్యకర్తలు నాయకులు రూ.2 లక్షలు సేకరించి వరదబాధిత నిధికి పంపారు. బండారు లీలావతి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 6: నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పాపంపేటకు చెందిన వెంకటరమణ (23) బోర్‌వెల్స్‌లో పనిచేస్తున్నాడు. గురువారం వెంకటరమణ తన స్నేహితుడు మనోజ్‌తో జాకీర్‌కొట్టాల నుంచి బైక్‌లో వ్యక్తిగత పనిమీద బయలుదేరాడు. రుద్రంపేట రోడ్డు నుంచి కళ్యాణదుర్గం రోడ్డు వరకు సర్వీస్‌రోడ్డులో వెళ్తుండగా ట్రాక్టర్, కంటైనర్‌ను క్రాస్‌చేసే క్రమంలో కంటైనర్‌ను బైక్ ఢీకొంది. దీంతో వెంకటరమణ తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మనోజ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్టూడియో యజమానికి జరిమానా

అనంతపురం క్రైం, సెప్టెంబరు 6: ఫొటోలు అందించని స్టూడియో యజమానికి వినియోగదారుల న్యాయస్థానం రూ.50వేల జరిమానా విధించింది. వివాహానికి ఫొటోలు, వీడియోలు తీసి అందించకపోవడమే ఇందుకు కారణం. శుక్రవారం వినియోగదారుల న్యాయస్థానం అధ్యక్షులు ఎం.శ్రీలత తీర్పు చెప్పారు. నగరానికి చెందిన శ్రీనివాసకుమార్ తన కుమారుడి వివాహం కోసం ఫొటోలు, వీడియోలు తీయడానికి ప్రతివాది జయచంద్రకు చెందిన స్టుడియోతో గత ఏడాది రూ.85వేలకు మాట్లాడాడు. రూ.75వేలు చెల్లించాడు. ఫొటోలు, వీడియోలు తీసిన అనంతరం రూ.10వేలు చెల్లిస్తానని చెప్పాడు. నెలలు గడుస్తున్నా ఫొటోలు, వీడియోలు ఇవ్వకపోవడంతో అర్జీదారుడు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. మొత్తం రూ.75వేలకు 24శాతం వడ్డీతో సహా చెల్లించాలని, మానసిక వేదనకు, సేవాలోపానికి కలిపి మరో రూ.లక్ష, కోర్టు ఖర్చుల కోసం రూ.20వేలతో చెల్లించాలని అర్జీదాఖలు చేశాడు. నోటీసులు అందుకున్న ఫొటో స్టుడియో యజమాని గైర్హాజరయ్యాడు. రూ.75వేలు 9శాతంతో వడ్డీతో చెల్లించాలని, రూ.50వేలు మానసిక వేదన, ఖర్చులకు రూ.5వేలు 45రోజుల్లో చెల్లించాలని న్యాయస్థానం తీర్పువెల్లడించింది.

ఆస్పత్రి వద్ద అన్నదానం



అన్నదానం చేస్తున్న గౌస్‌మొద్దీన్, బాలకృష్ణ అభిమానులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 6: హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ కుమారుడు నందమూరి మోక్షజ్ఞ పుట్టిన రోజును పురస్కరించుకుని బాలకృష్ణ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద అన్నదానం చేశారు. బాలకృష్ణ అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్, హరీష్‌రెడ్డి, రఘురాములు, చిరంజీవి, రాజేష్, సుబ్బరాయుడు, శివ, నాగభూషణం, షఫీ, బాలకృష్ణ, ఫకృద్దీన్, శంకర్, లక్ష్మీనారాయణ, హర్ష పాల్గొన్నారు.

గణేష్ చతుర్థికి మండపాల ఏర్పాటు



మామిళ్లపల్లిలో మండపాన్ని సిద్ధం చేస్తున్న యువకులు

ధర్మవరం రూరల్(కనగానపల్లి) సెప్టెంబరు 6: వినాయకచవితి ఉత్సవాలు నిర్వహించేందుకు గ్రామాల్లో మండపాలు ఏర్పాట్లలో యువకులు నిమగ్నమయ్యారు. మండల కేంద్రంతో పాటు మామిళ్లపల్లి, చంద్రాచెర్ల, తూంచెర్ల, తగరకుంట, ముత్తవకుంట్ల తదితర గ్రామాల్లో పదుల సంఖ్యలో వినాయకవిగ్రహాలు కొలువుదీరనున్నాయి. శనివారం వినాయకచవితిని ప్రజలు జరుపుకోనున్నారు.



ప్రత్యామ్నాయ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రత్యామ్నాయ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

● విత్తన పంపిణీలో ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 6: ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తూ ప్రభుత్వం 80శాతం సబ్సిడీతో విత్తనాన్ని అందిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పరిటాలసునీత సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం రైతులకు సబ్సిడీ విత్తనాన్ని ఎమ్మెల్యే పంపిణీచేశారు. ఆమె మాట్లాడుతూ వర్షాభావంతోవేరుశనగ పంట సాగుచేసుకోని రైతులంతా ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసుకోవాలన్నారు. మండలంలో 42వేల ఎకరాలకుగాను కేవలం 16వేల ఎకరాలలో మాత్రమే పంటను సాగుచేశారన్నారు. మిగిలిన రైతులు కూడా పంటలను సాగుచేసేందుకు సబ్సిడీతో విత్తనాలను అందిస్తున్నామన్నారు. సత్యసాయిజిల్లాలో 720 క్వింటాళ్ల అలసంద, 2099 క్వింటాళ్ల పెసులు, 15,220 క్వింటాళ్ల ఉలవలు మొత్తం 18,265 క్వింటాళ్ల విత్తనాన్ని ప్రభుత్వం సిద్ధంగా ఉంచిందన్నారు. రైతుకు ఏ కష్టమొచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. ఏఓ ఉదయ్‌కుమార్, ఏపీసీడ్స్ జిల్లా మేనేజర్ సిద్ధయ్య, టీడీపీ కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, అంకే అమరేంద్ర, జనసేన కన్వీనర్ క్రాంతికుమార్, ఈడిగ చెన్నకేశవగౌడ్, మాడెం సూర్యనారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, హరినాథరెడ్డి, ముత్యాలప్ప, అమరేంద్రరెడ్డి, ఆంజనేయులు, కోళ్ల సూరి పాల్గొన్నారు.

జీతాల కోసం ఆస్పత్రి కార్మికుల ఆందోళన



మెడికల్ కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 6: ఐదు నెలలైనా జీతాలు ఇవ్వలేదు, ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్నామని వేడుకుంటూ అధికారులు కనికరించడం లేదు, పండుగకు కూడా జీతాలు ఇవ్వకుండా పస్తులు పెడతారా అంటూ ఆస్పత్రి పారిశుధ్య కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక వైద్యకళాశాల ప్రధానగేటు వద్ద పారిశుధ్య కార్మికులు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, నాయకులు చిరంజీవి, కృష్ణుడు, వెంకటేష్, ప్రశాంత్ మద్దతు ఇవ్వగా కార్మికులు కళాశాల గేటుముందు బైఠాయించి వైద్యాధికారులు, కాంట్రాక్టర్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సోమవారం వరకు గడువు ఇస్తున్నామని అప్పటికీ జీతాలు ఇవ్వకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ఏఐటీయూసీ నాయకులు హెచ్చరించారు. నారప్ప, పెద్దన్న, షామీదాతోపాటు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ జేడీగా వెంకటస్వామికి ఉద్యోగోన్నతి



అనంతపురం అర్బన్, సెప్టెంబరు 6: పెనుకొండ గొర్రెలు, మేకల పెంపక క్షేత్రం డీడీ వెంకటస్వామికి పశుసంవర్ధక శాఖ జేడీగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ జేడీగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం గత నెలలో పదవీ విరమణ పొందారు. డీడీ వెంకటస్వామికి ఇన్‌చార్జి జేడీ గా బాధ్యతలు అప్పగించారు. తాజాగా ఆయనకు ఉద్యోగోన్నతి లభించడంతో ఇక్కడే రెగ్యులర్ జేడీగా కొనసాగనున్నారు. అలాగే పశుసంవర్ధక శాఖలో ఏడీలుగా పనిచేస్తున్న ఇద్దరికి డీడీలుగా ఉద్యోగోన్నతి లభించింది. ఉరవకొండ ఏడీగా పనిచేస్తున్న కాంతమ్మను ఉద్యోగోన్నతిపై పెనుకొండ గొర్రెలు, మేకల పెంపకం క్షేత్రం డీడీగా బదిలీ చేశారు. యల్లనూరు ఆస్పత్రి ఏడీ మల్లారెడ్డిని ఉద్యోగోన్నతిపై నెల్లూరు జిల్లా కావలి డీడీగా బదిలీ చేశారు. అదే విధంగా విజయనగరం జిల్లా తెర్లాంలో ఏడీగా పనిచేస్తున్న డాక్టర్ నాగరాజును పెనుకొండ డీడీగా బదిలీ చేశారు. పెనుకొండ డీడీ సత్యప్రకాష్‌ను శ్రీకాకుళం జిల్లా డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా డెప్యుటేషన్‌పై బదిలీ చేశారు. ఉద్యోగోన్నతి పొందిన అధికారులకు ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి: డీఎంహెచ్ఓ



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి

గార్లదిన్నె, సెప్టెంబరు 6: సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని వైద్యులు నిత్యం అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబీ దేవి సూచించారు. శుక్రవారం మండలంలోని ఇల్లూరు గ్రామంలో జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులుతో కలిసి ఆమె పర్యటించారు. గ్రామంలో విష జ్వరాలతో తండ్రి, కొడుకు మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. గ్రామంలో అపరిశుభ్రత లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ విజయ్‌భాస్కర్, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, వైద్యాధికారి గౌతమి పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడమేమనగా మా కక్షిదారుడయిన పి.రఘునాథరెడ్డి తండ్రి:లేట్ పెదపల్లి గంగిరెడ్డి, డోర్‌నెం.12-2-83, ఆశోక్‌నగర్, అనంతపురం అను వారికి హక్కు అనుభవం గల క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 3167/2006 తేదీ:04-03-2006 పి.రఘునాథ్ రెడ్డి, తండ్రి: లేట్ పి.గంగిరెడ్డి, అశోక్ నగర్, అనంతపురం గారి పేరుతో వున్న విక్రయపత్రం అనంతపురం టౌను కళ్యాణ దుర్గం రోడ్డు, పాపంపేట, జిరాక్స్ సెంటర్ దగ్గర పోగొట్టుకొన్నానని ఈ విషయము అనంతపురం రూరల్ పోలీసుస్టేషను నందు పిర్యాదు చేసి వారి నుంచి ఒక సర్టిఫికెట్ పొంది వున్నారని. కావున ప్రస్తుతం తమవద్ద ఒరిజినల్ డాక్యుమెంట్ నకలు మాత్రమే వున్నవని తెలిపియున్నారు. కావున ఎవరికైనా ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని గురించి గానీ సదరి పత్రము గురించి గానీ ఆక్షేపణలున్నచో ఈ ప్రకటన వెలువడిన 7 రోజులు లోపల నాకు తెలుపుకోరుచున్నాను.

షెడ్యూలు

అనంతపురం రి॥డి॥ అనంతపురం సబ్॥డి॥కి చేరిన అనంతపురం గ్రామ పొలం ఆలమూరు పంచాయతీ ఏరియాలోని ఆస్తి వివరం.
బాబు వివరం: సర్కారుఖుష్కి, సర్వేనెం: 292/4, ఎ.సి:5.00 హెక్టార్లు 2.025,
చెక్కుబంది: తూర్పు: సర్వేనెం.292/3, 296 గల జమీను మరియు చెరువు దక్షిణం: సర్వేనెం:295, పడమర: సర్వేనెం.294 గల జమీను, ఉత్తరం: సర్వేనెం.292/2 గల జమీను.

K.Ramachandra Reddy M.A.BL
Advocate, Anantapur
Cell:9346559622.

IN THE COURT OF VTE ADDL. DISTRICT JUDGE DHARWAD SITTING AT : HUBBALLI (KARNATAKA)
(COMMERCIAL COURT JURISDICTION)
COMMERCIAL SUIT NO. 5001 /2024

PLAINTIFF: M/S. DHANASHRI ENTERPRISES PROPRIETOR BAHETY BADAL S/O. JAWAHARLAL BAHETY #32, II FLOOR, SATELLITE COMPLEX. KOPPIKAR ROAD HUBBALLI-580020. (KARNATAKA)

V/S

DEFENDENT: M/S. MD NOOR MANUFACTURERS PROP: MR. DADAWALI S/O. SHARIF KOLIWAD ALIAS RAMZANWALE KOLIWAD 6/78 PLOT NO. -18 INDUSTRIAL ESTATE - BELLARY ROAD: ANANTAPUR- 515001 (ANDHRA PRADESH)

NOTICE UNDER ORDER 5 RULE 20 OF CPC

Take notice that, the Plaintiff has filed commercial Original Suit before the above commercial court against the Defendant to recover the dues of Rs. 21,98,829-00 with interest which the defendant owe regarding Business transactions.

Note that, court was issued summons against Defendant through RPAD was not served even though it was proper address. Hence, court is ordered for the substituted service through publication in the local news paper. Notice is hereby issued Defendant to appear before the above Commercial court at 11.00 AM on 30-09-2024 in person or through counsel thereby represent in the case, file the objections or documents if any as defense. Failing which EX-Parte order will be passed by the Hon'ble court.

Notice is issued on the ORDER of the Hon'ble court DTD 25.6.2024.

(By Order of the court)

SHIRESTEDAR
ADDL. DISTRICT JUDGE
DHARWAD SITTING AT:
HUBBALLI (KARNATAKA)
(COMMERCIAL COURT JURISDICTION)

ఎమ్మెల్యే ఆదిమూలంను అరెస్టు చేయాలి

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 6: తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను వెంటనే అరెస్టు చేయాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, జిల్లా అధ్యక్షురాలు శ్యామల, చంద్రిక శుక్రవారం సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదిమూలంను పార్టీ నుంచి సస్పెండ్ చేసినంత మాత్రాన సరిపోదని, ఆయనపై కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలన్నారు.

శ్రీనివాసుల నాయుడు ఎఫ్ఏ కాదు: ఏపీఓ

శింగనమల సెప్టెంబరు 6: జూలాకాలువ గ్రామంలో వితంతువును వేధించిన శ్రీనివాసులు నాయడు ఫీల్డ్ అసిస్టెంట్ కాదని ఏపీఓ శ్రీదేవి స్పష్టం చేశారు. శుక్రవారం వితంతువుకు ఫీల్డ్ అసిస్టెంట్ వేధింపులు అనే కథనం పలు పత్రికలలో ప్రచురితం కావడంతో ఏఈపీఓ స్పందించారు. శ్రీనివాసులు నాయడు అనే పేరుతో ఫీల్డ్ అసిస్టెంట్ ఎవరూ లేరని అన్నారు. త్వరలో నేనే కాబోయే ఫీల్డ్ అసిస్టెంట్ అని ఆయన ప్రచారం చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆయనకు ఉపాధి పథకంతో ఎలాంటి సంబంధం లేదన్నారు.

స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తాం

గార్లదిన్నె, సెప్టెంబరు 6: తమ సమస్యలు పరిష్కారంపై అధికారులు స్పందించే వరకు సమ్మెను కొనసాగిస్తామని సత్యసాయి తాగునీటి కార్మికులు అన్నారు. బకాయి వేతనాలు చెల్లించాలని కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 16వ రోజుకు చేరింది. కల్లూరులోని సత్యసాయి తాగునీటి పంపుహౌస్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. నాగభూషణం, మల్లరాయుడు, శ్రీనివాసులు, శంకర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో వినాయకచవితి సంబరాలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 6: నగరంలోని పలు స్కూళ్లలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నగరంలోని మినర్వా స్కూల్‌లో పండుగా చేశారు. కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, ఇతర టీచర్లు పాల్గొన్నారు. కోర్టు రోడ్డులోని శ్రీచైతన్య స్కూల్‌లో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ తబస్సుమ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. హౌసింగ్ బోర్డులోని ఆదర్శ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో చిన్నారులు వినాయక చిత్రాలను వినూత్న రీతిలో ఆవిష్కరించారు. ఉపాధ్యాయుడు వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.



మినర్వా స్కూల్‌లో..



శ్రీచైతన్య స్కూల్‌లో...



ఆదర్శ స్కూల్‌లో...

చవితి సందడి..

- పండుగ, పూజాసామగ్రి కొనుగోలుకు భారీగా తరలివచ్చిన ప్రజలు
- పట్టణాల్లో కిక్కిరిసిన మార్కెట్లు, దుకాణాలు


తాడిపత్రి పోలీస్‌స్టేషన్ సర్కిల్లో విక్రయానికి ఉన్న వినాయక ప్రతిమలు ..


పూలు, చెరకు, పండ్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు


గుంతకల్లు గాంధీసర్కిల్‌లో వినాయక ప్రతిమను కొనుగోలు చేస్తున్న మహిళలు


ఉరవకొండలో పూజా సామగ్రిని కొంటున్న ప్రజలు

తాడిపత్రి ,సెప్టెంబరు 6: వినాయక చవితి పండుగ శనివారం జరగనుండడంతో పట్టణంలో సందడి నెలకొంది. పండుగను పురస్కరించుకుని శుక్రవారం ప్రజలు పూజాసామగ్రితో పాటు సరుకులు కొనుగోలు చేయడానికి పెద్దఎత్తున తరలివచ్చారు. స్థానికులే కాకుండా.. గ్రామాల ప్రజలు సైతం భారీగా వచ్చి వచ్చారు. వినాయకప్రతిమలు, మామిడి, అరటి ఆకులు, కూరగాయలు, పూలు, పండ్లు, నిత్యావసర సరుకులు తదితరాల కొనుగోలుకు దుకాణాల వద్ద క్యూ కట్టారు. దీంతో స్థానిక కూరగాయల మార్కెట్‌తోపాటు పోలీస్‌స్టేషన్ సర్కిల్, యల్లనూరురోడ్డు సర్కిల్ తదితర ప్రాంతాలు కిటకిటలాడాయి. పెద్ద పెద్ద ప్రతిమలను ఉత్సవాల నిర్వాహకులు వివిధ వాహనాల ద్వారా ఎంతో ఉత్సాహంగా మండపాలకు తరలించారు. దీంతో సందడి నెలకొంది.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్, గాంధీచౌక్, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాలు పండగ సామగ్రి కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. ఎన్టీఆర్ విగ్రహం నుంచి గాంధీ విగ్రహం వరకు మొయిన్ రోడ్డులో వినాయక విగ్రహాలు, పూజా సామగ్రి, పూలు, పండ్ల దుకాణాలు వెలిశాయి. వాటిని కొనడానికి పెద్దఎత్తున తరలివచ్చారు.

ఉరవకొండ: పట్టణంలోని టవర్‌క్లాక్‌కూడలిలో చవితి సందడి నెలకొంది. స్థానికులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పండగ సామగ్రి కొనుగోలు చేశారు. దీంతో ఆ కూడలి రద్దీగా మారింది.

పశుసంవర్ధక శాఖ జేడీగా వెంకటస్వామి



అనంతపురం అర్బన్, సెప్టెంబరు 6: పెనుకొండ గొర్రెలు, మేకల పెంపకం క్షేత్రం డీడీ వెంకటస్వామికి పశుసంవర్ధక శాఖ జేడీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పశుసంవర్ధక శాఖ జేడీగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం గత నెలలో రిటైర్డ్ అయ్యారు. దీంతో డీడీ వెంకటస్వామికి ఇన్‌చార్జి జేడీగా బాధ్యతలు అప్పగించారు. తాజాగా ఆయనకు పదోన్నతి లభించడంతో ఇక్కడే రెగ్యులర్ జేడీగా కొనసాగనున్నారు. అలాగే పశుసంవర్ధక శాఖలో ఏడీలుగా పనిచేస్తున్న ఇద్దరికి డీడీలుగా పదోన్నతి లభించింది. ఉరవకొండ ఏడీగా పనిచేస్తున్న కాంతమ్మను పదోన్నతిపై పెనుకొండ గొర్రెలు, మేకల పెంపకం క్షేత్రం డీడీగా బదిలీ చేశారు. యల్లనూరు ఆస్పత్రి ఏడీ మల్లారెడ్డిని పదోన్నతిపై నెల్లూరు జిల్లా కావలి డీడీగా బదిలీ చేశారు.

ఎక్సైజ్ ఎస్‌ఐకు ఉద్యోగోన్నతి

కణేకల్లు, సెప్టెంబరు 6: మండలకేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్‌రావుకు సీఐగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చారు. దీంతో శుక్రవారం ఆయనకు సీఐ మురళీకృష్ణ అభినందనలు తెలిపారు. గత రెండేళ్లుగా ఎస్‌ఐగా విధులు నిర్వహించిన ప్రభాకర్‌రావు సీఐగా ప్రమోషన్‌పై ఇతర ప్రాంతానికి వెళుతుండడంతో స్థానిక సిబ్బంది వీడ్కోలుసభ నిర్వహించి సన్మానం చేశారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి

ఉరవకొండ, సెప్టెంబరు 6: గోకులం షెడ్లు, గాలికుంటు టీకాల లక్ష్యాలను నిర్దేశించిన మేరకు పూర్తి చేయాలని పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి సిబ్బందికి సూచించారు. పట్టణంలోని లయన్స్ క్లబ్ యోగా సెంటర్‌లో శుక్రవారం ఆయన డివిజన్ స్థాయి సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. సిబ్బంది ప్రభుత్వ పథకాలను రైతులకు అందేలా చూడాలన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న కరస్పాండెంట్, విద్యార్థులు

బెళుగుప్ప, సెప్టెంబరు 6: విజయవాడలో వరదలతో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు గాను మండల కేంద్రంలోని శ్రీనివాస విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు శుక్రవారం విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా తొలుత బాధితులను ఆదుకుందాం.. స్పందించాలని కోరుతూ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ సుమ, సిబ్బంది గాయత్రి, నరేష్, తిప్పేస్వామితో పాటు టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం దంపతుల ఆర్థిక సాయం

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 6: మండలంలోని చదం గ్రామ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం హేమలత, రిటైర్డ్ హెచ్‌ఎం సత్యనారాయణ దంపతులు వరద బాధితులకు రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు. వారు పట్టణంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును శుక్రవారం కలిసి చెక్కును అందించారు. ఇటీవల విజయవాడలో వరదలు రావడంతో అనేకమంది నిర్వాసితులయ్యారని, వారి సహాయార్థం తమ వంతుగా కొంత సొమ్మును ఎమ్మెల్యే ద్వారా సీఎం సహాయనిధికి అందించామని తెలిపారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం


బెళుగుప్పలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ రామచంద్ర


పామిడిలో పంపిణీ చేస్తున్న జనసేన మండల అధ్యక్షుడు ధనుంజయ


ఉరవకొండలో పంపిణీ చేస్తున్న గవిమఠం ఉత్తరాధికారి, సీఐ తదితరులు

బెళుగుప్ప, సెప్టెంబరు 6: చవితికి మట్టి వినాయకులనే పూజిద్దామని ఎంపీడీవో రామచంద్ర సూచించారు. పట్టణంలో శుక్రవారం ఆయన సన్‌రైజర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి వినాయకులతో పాటు మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్యాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో వాతావరణం కాలుష్యమవుతుందన్నారు. దీంతో జీవరాసులకు ముప్పు వాటిల్లుతుందన్నారు. కనుక మట్టి వినాయకులనే పూజించాలని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ గోవిందరెడ్డి, కరెస్పాండెంట్ మారెన్న, రిటైర్డ్ ఉపాధ్యాయుడు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పామిడి: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని జనసేన మండల అధ్యక్షుడు ధనుంజయ పేర్కొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో మట్టి వినాయకులను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సహజ సిద్ధమైన మట్టి విగ్రహాలతో పండుగలు జరుపుకోవడం వల్ల పర్యావరణాన్ని కాపాడిన వారమవుతామన్నారు. జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలో జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గవిమఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ ప్రవీణ్‌కుమార్, జైకిసాన్ ఫౌండేషన్ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

- సీఐటీయూ నాయకుల డిమాండ్


కళ్యాణదుర్గంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన కార్మికులు, సీఐటీయూ నాయకులు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 6: శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆయా కార్మికులతో కలిసి సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు.. సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు 6 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, ఇలా అయితే వారు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా.. ఏ ఒక్కరూ పట్టించుకోలేదన్నారు. కార్మికులపై చిన్నచూపు తగదన్నారు. ఇప్పటికైనా పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. సమ్మెకు బోరంపల్లి సర్పంచు సోమశేఖర్‌రెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్, సత్యసాయి జిల్లా కార్యదర్శి వన్నూరప్ప, జిల్లా ట్రెజరర్ వన్నూరుస్వామి, డివిజన్ అధ్యక్షుడు నరేష్, నాయకులు రమేష్, ప్రభాకర్, భవిత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం

రాయదుర్గంరూరల్: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున తెలిపారు. పట్టణంలోని పాత మున్సిపల్ ఆఫీసు వద్ద తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. తక్షణమే అధికారులు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలన్నారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శకుంతల, రమాదేవి మద్దతునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు సంజయ్, అశోక్, అంజి, మంజు, రాజశేఖర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: సమస్యలు పరిష్కరించాలని సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల్లో పనిచేస్తున్న కార్మికులు మండలకేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం నిరసనకు దిగారు. తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలన్నారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు.

8 మంది వైసీపీ నాయకుల రిమాండ్

డీ.హీరేహాళ్, సెప్టెంబరు 6: మండలంలోని కల్యం గ్రామంలో ఇటీవల జరిగిన గొడవకు సంబంధించి ఎనిమిదిమంది వైసీపీ నాయకులను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. కల్యం గ్రామంలో గత మంగళవారం రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడడంతో అతడిని చికిత్స కోసం అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రాజు, జయరాం తదితరులు ఆటోలో ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. సమయంలో వైసీపీ నాయకుడు లోకేష్ మరి కొందరు ఆటోకు అడ్డుగా నిలబడ్డారు. దీంతో రాజు, జయరాం ఆటోకు అడ్డు తొలగండని అడగ్గా.. మమ్మల్నే తప్పుకోమంటావా అంటూ వారు దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో కర్రలతో విచక్షణారహితంగా కొట్టారు. దాడిలో గాయపడ్డ టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు వైసీపీ నాయకుడు లోకేష్‌తో పాటు మరో ఏడుగురిని అరెస్టు చేసి రాయదుర్గం సివిల్ కోర్టులో హాజరుపరచగా 14 రోజుల పాటు రిమాండ్‌కు విధించారు. వారిని అనంతపురం సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గుమ్మఘట్ట, సెప్టెంబరు 6: మండలంలోని దేవరెడ్డిపల్లి సమీపంలో శుక్రవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. దేవిరెడ్డి పల్లికి చెందిన ఈశ్వర్‌రెడ్డి రాయదుర్గం పట్టణానికి వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. కాగా ఆటో కొద్ది దూరం వెళ్లగానే ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం తగిలింది. అందులో సైడ్‌లో కూర్చున్న ఈశ్వర్‌రెడ్డి కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు అతడిని చికిత్స కోసం రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం బళ్లారి విమ్స్‌కు తరలించారు. గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

10న హుండీల లెక్కింపు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 6: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 10వతేదీన హుండీల ఆదాయాన్ని లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ భద్రాజి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. భక్తులు హుండీల్లో వేసిన కానుకలను మంగళవారం ఉదయం ఆలయంలోనే లెక్కిస్తామని చెప్పారు.

గర్భిణులకు అన్నదానం

గుత్తి, సెప్టెంబరు 6: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి శుక్రవారం వచ్చిన గర్భిణులకు జనసేన నాయకులు అన్నదానం చేపట్టారు. నాయకులు చిన్నవెంకటేశులు, పాటిల్ సురేష్, బ్రహ్మయ్య, వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 6: ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంపు సికింద్రాబాద్‌కు 74 ఉడేగోళంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి నలుగురు ఎన్‌సీసీ కేడెట్లు ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఆర్మీ అటాచ్‌మెంట్‌కు ఎంపికైన ఎన్‌సీసీ కేడెట్లు పదిరోజుల పాటు అక్కడ ఆర్మీశిక్షణ తీసుకుంటారన్నారు. ఎంపికైన వారికి ఎన్‌సీసీ సీటీఓ జక్కల కిరణ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీ

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 6: కంబదూరు మండలం కదిరిదేవరపల్లిలో గురువారం అర్ధరాత్రి సమయంలో వ్యవసాయ మోటార్లకు విద్యుత్‌ను సరఫరా చేసే రెండు ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగివైర్లను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఉదయం రైతులు పొలాల వద్దకు వెళ్లి చూడగా.. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద వైర్లు కట్ చేసిన ఆనవాళ్లు కనిపించాయి. దీంతో పరిశీలించగా.. దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లకు పైన ఓపెన్ చేసి విద్యుత్ తీగలను తొలగించి, కేవలం రాగి వైర్‌ను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ దొంగతనాలు ఇటీవల అధికమయ్యాయని రైతులు ఆందోళన చెందారు. అనంతరం కంబదూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తోటలో కేబుల్ చోరీ

యాడికి: మండలకేంద్రంలోని చందన రోడ్డులో గల రైతు తిరుపాలు తోటలో కరెంట్ కేబుల్‌ను దొంగలు చోరీ చేసిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. తోటలో దొంగలు పడి రెండు విద్యుత్ స్తంభాల మధ్య ఉన్న కేబుల్‌ను కట్ చేసుకుని తీసుకెళ్లారని బాధిత రైతు తెలిపారు. దీని విలువ సుమారు రూ.10వేలు ఉంటుందన్నారు. దొంగలు చేస్తున్న ఈ పనులతో పంటలను ఎండబెట్టుకోవాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు

నిత్యావసరాల ధరలను తగ్గించాలి

పెద్దవడుగూరు, సెప్టెంబరు 6: నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని కోరుతూ మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి వెంకటరాముడు యాదవ్, సీనియర్ నాయకుడు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నిత్యావసర వస్తువులైన బియ్యం, కందిబేడలు, పప్పులు, చింతపండు తదితరాల ధరలు ఆకాశాన్ని తాకుతుండడంతో సామాన్య , పేద ప్రజలు కొనే పరిస్థితిలో లేరన్నారు. దీనికితోడు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను కేంద్రప్రభుత్వం ఇష్టానుసారంగా పెంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా ధరలను వెంటనే తగ్గించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రంగస్వామి, ఆదినారాయణ, ఓబిరెడ్డి, హుస్సేన్‌పీరా, రఘురామయ్య, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోండి

పుట్లూరు/ యల్లనూరు సెప్టెంబరు6: వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ సుబ్రహ్మణ్యం సూచించారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన వినాయ క మండపాల నిర్వాహకుల తో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండపాల వద్ద ఎవరూ ఎలాంటి గొడవలు, ఘర్షణలకు దిగరాదన్నారు. ఏ చిన్నపాటి సంఘటన జరిగినా నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నిమజ్జన సమయంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ఆయన యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లోనూ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లో ఎటువంటి గొడవలు, ఘర్షణలు లేకుండా చవితి వేడుకలను నిర్వహించుకోవాలన్నారు. నిమజ్జన కార్యక్రమాన్ని కూడా ప్రశాంతంగా జరపాలన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమాల్లో ఆయా పోలీస్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

గుంతకల్లుటౌన్: వినాయక విగ్రహాల నిమజ్జనం రోజు ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్ సీఐలు మనోహర్, ఏపీ మస్తాన్ హెచ్చరించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషనలో వారు వినాయక విగ్రహాల నిమజ్జనంపై హిందూ, ముస్లిం, క్రిష్టియన్ మత పెద్దలతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గొడవలు, అల్లర్లకు పాల్పడరాదన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిమజ్జనం ప్రాంతాల పరిశీలన

యాడికి, సెప్టెంబరు 6: మండలంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే ప్రాంతాలను డీఎస్పీ జనార్దన్‌నాయుడు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కోనచెరువు, ఆదర్శ పాఠశాల వద్ద వంకను పరిశీలించారు. సోమవారం నిర్వహించే నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు చేయాలని, నిమజ్జన ప్రాంతాల్లో తగు భద్రతా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట సీఐ ఈరన్న ఉన్నారు.

స్వయం ఉపాధితోనే ఆర్థికాభివృద్ధి


మాట్లాడుతున్న గుమ్మనూరు ఈశ్వర్

పామిడి, సెప్టెంబరు 6: స్వయం ఉపాధితోనే ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు, టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత బ్యూటీషియన్, టైలరింగ్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి కుటుంబ ఆర్థికాభివృద్ధికి స్వయం ఉపాధి ఎంతో అవసరమన్నారు. మహిళల్లో నైపుణ్యాన్ని వెలికితీసి ఉపాధి అవకాశాలుగా మలిచేందుకు ఐసీడీఎస్ మరింత కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ భవనాలకు స్థలాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పలువురు గర్భిణులకు సామూహిక సీమంతం చేపట్టి చీర తాంబుళాలను అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ డిల్లీశ్వరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై కనిపించాడు


రాజప్ప (ఫైల్)

బొమ్మనహాళ్, సెప్టెంబరు 6: రెండు రోజుల క్రితం అదృశ్యమైన మండలంలోని దర్గాహోన్నూరు గ్రామానికి చెందిన రాజప్ప(32) శుక్రవారం గ్రామ శివారులోని ఓ పొలంలో శవమై కనిపించాడు. ఎస్‌ఐ నబీరసూల్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజప్ప ఈ నెల 4వ తేదీన తన భార్య లక్ష్మి అదే గ్రామానికి చెందిన రాము అనే వ్యక్తితో సన్నిహితంగా ఉండడం చూసి మందలించాడు. అనంతరం కోపంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. తర్వాత తిరిగి రాలేదు. గ్రామ సమీపంలోని ఓ పొలంలో విగతజీవిగా పడి ఉండగా.. శుక్రవారం ఉదయం అటువైపు వెళ్తున్న రైతులు గుర్తించారు. వెంటనే అతడి బంధువులకు సమాచారం అందించారు. భార్య ప్రవర్తన సరిగా లేకపోవడంతో రాజప్ప మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆయన సోదరుడు చంద్రహాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించామన్నారు. మృతుడికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి గాయాలు

తాడిపత్రి, సెప్టెంబరు 6: మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గదరగుట్టపల్లి గ్రామానికి చెందిన లాలెప్ప (66), విఘ్నేశ్వరరెడ్డి పనినిమిత్తం ద్విచక్రవాహనంలో తాడిపత్రికి వచ్చారు. పని అనంతరం స్వగ్రామానికి బయలుదేరారు. వెంకటరెడ్డిపల్లి గ్రామ సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా నాపరాళ్ల లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో లాలెప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. విఘ్నేశ్వరరెడ్డికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. మృతుడికి భార్య రాజకుళ్లాయమ్మ, ముగ్గురు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టుకోండి చూద్దాం..

- యాడికి మండలంలో వారంలోనే మూడుసార్లు దొంగతనాలు
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- వరుస చోరీలతో పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు


రాయలచెరువులో ఫర్టిలైజర్ దుకాణంలో చోరీ చేస్తున్న దుండగుడు (ఫైల్)


యాడికి: ఇంటి బీరువాలోని వస్తువులను చిందరవందరగా పడేసిన దృశ్యం (ఫైల్)

యాడికి, సెప్టెంబరు 6: మండలంలో వరుస దొంగతనాలకు పాల్పడుతూ చేతనైతే పట్టుకోండి చూద్దాం అంటూ దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. తాళాలు వేసిన ఇళ్లు, దుకాణాలను టార్గెట్ చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. అంతా అయిపోయాక పోలీసులు తీరిగ్గా వచ్చి ఆరాతీయడం, వెళ్లిపోవడం జరుగుతోందని స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చోరీలపై బాధితులు ఫిర్యాదు చేయాలనుకున్నా.. మీ ఇంటిలో ఏమి పోలేదు కదా అని పోలీసులు దబాయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు తూతూమంత్రంగా కూడా గస్తీ నిర్వహించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మండలంలో వారం రోజుల వ్యవధిలో జరిగిన దొంగతనాలను పరిశీలిస్తే ఆగస్టు 29వ తేదీన యాడికిలోని రామస్వామివీధిలో తాళం వేసి ఊరికి వెళ్లిన వెంకటస్వామి ఇంటిలో దొంగలు పడి బీరువా పగలగొట్టారు. విలువైన వస్తువులు ఏమీ లేకపోవడంతో వెళ్లిపోయారు. అదేరోజు అదే వీధిలోనే రత్నమయ్య అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి వెళ్లగా.. రాత్రి వేళ దొంగలు పడ్డారు. చోరీయత్నం చేసి వెళ్లిపోయారు. అదేవిధంగా కెనరాబ్యాంక్ వీధిలో రాముడు అనే వ్యక్తి తాళం వేసి ఊరికి వెళ్లిన సమయంలో రాత్రి దొంగలు పడ్డారు. స్థానికులు పసిగట్టడంతో పారిపోయాడు. ఆగస్టు 30న రాయలచెరువులోని ఉమాశ్రీరంగా ఫర్టిలైజర్స్ దుకాణంలో దొంగలు పడి రూ.74వేలు నగదు దోచుకెళ్లారు. ఈ దృశ్యం సీసీ పుటేజీలో రికార్డు అయినప్పటికి ఇంతవరకు దొంగను పట్టుకోలేకపోయారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాడు. ఈనెల 2న యాడికిలోని బస్టాండ్ వద్ద ఒక కాంప్లెక్స్‌లోని మూడు దుకాణాల్లో దొంగలు పడ్డారు. చోరీయత్నం చేశారు. విలువైన వస్తువులు ఏమీ చోరీకి గురికాలేదు.

ప్రజలే గస్తీ తిరగాల్సి వస్తోంది..

రాత్రి వేళల్లో దొంగల సంచారం ఎక్కువగా ఉండడంతో కాలనీవాసులమే గుంపుగా గస్తీ తిరుగుతున్నాము. తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్‌గా చేసుకొని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఎప్పుడు ఎవరి ఇంటిలో దొంగలు పడతారో అన్న భయం యాడికిలో వాసుల్లో నెలకొంది. పోలీసులు తగు చర్యలు తీసుకొని దొంగతనాలను అరికట్టాలి.

- నాగరాజు, బ్యాంక్‌వీధి, యాడికి

అపరిచిత వ్యక్తుల సంచారం ఎక్కువగా ఉంది..

యాడికిలో అపరిచిత వ్యక్తుల సంచారం ఎక్కువగా ఉంది. పోలీసులు వీరిపైన దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వరుస చోరీలతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయం నెలకొంది. దొంగతనాల నివారణకై పోలీసులు గట్టి చర్యలు చేపట్టాలి.

- రాము, రామస్వామికాలనీ, యాడికి